విజయ.. విక్రమ్


జాతీయ పతాకంతో చిన్నారుల ఆనందం

చంద్రయాన్–3 విక్రమ్ లాండర్ చంద్రుడిపై విజయవంతంగా దిగడంతో సంబరాలు మిన్నంటాయి. జూలై 14న నిప్పులు విరజిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్లిన చంద్రయాన్–3 నౌక 41 రోజుల సుదీర్ఘ ప్రయాణం అనంతరం బుధవారం సా.6.04 గంటలకు చంద్రుడి దక్షిణ ధృవంపై విజయవంతంగా దిగింది. తద్వారా చంద్రుడిపై కాలుమోపిన తొలిదేశంగా భారత్ చరిత్ర సృష్టించింది. విక్రమ్ లాండర్ విజయవంతంగా దిగాలని దేశ ప్రజలు ఆకాంక్షించారు. మంగళం తిరుమలనగర్‌లోని అన్నపూర్ణ సమేత ఈశానేశ్వర నవలింగ ఆలయంలో విద్యార్థులు చంద్రయాన్–3 శతకం నమూనాకు అభిషేకాలు చేశారు. అలాగే పలుచోట్ల సంబరాలు జరుపుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ విజయం సాధించిన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి


చంద్రగిరి : ప్రభుత్వ పాఠశాలలో చంద్రయాన్-3 చివరి ఘట్టాన్ని తిలకిస్తున్న విద్యార్థులు


చంద్రయాన్-3 విజయవంతంపై సంబరాలు జరుపుకుంటున్న సెట్విన్, సైన్స్ సెంటర్ అధికారులు


స్వీట్స్ పంచిపెడుతున్న గుండాల గోపీనాథ్‌రెడ్డి

మోహిత్‌రెడ్డికి ఘన సన్మానం

- ప్రజా జీవితంలో వ్యక్తిత్వం, సంస్కారం ముఖ్యం
- దీర్ఘ కాలిక సమస్యలకు పరిష్కారం
- చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వెల్లడి


తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని అభినందిస్తున్న తిరుపతి రూరల్ సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది

తిరుపతి రూరల్: తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) చైర్మన్‌గా నియమితులైన తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీకి క్యాబినెట్ హోదాతో తుడా చైర్మన్ పదవి వరించడంపై సభ్యులు అభినందనలు తెలుపుతూ తీర్మానం చేశారు. మోహిత్‌రెడ్డిని అభినందనలతో ముంచెత్తారు. సీఎం జగనన్న ఆశీస్సులు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సహకారంతో తుడా చైర్మన్ పదవికి వన్నె తీసుకొస్తానన్నారు. తనకు రాజకీయ పునాదిగా నిలిచిన పెరుమాళ్లపల్లి గ్రామస్తులకు, రూరల్ మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలపై ప్రత్యేక దృష్టి

ఇప్పటికే చంద్రగిరి నియోజకవర్గంలో వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. అభివృద్ధిని కొనసాగిస్తూనే సామాజిక సమస్యలపైనా ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. వెంకటపతి నగర్, పేరూరు, గాంధీపురం పంచాయతీల్లో దశాబ్దాల తరబడి అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించినట్టు చెప్పారు. త్వరలో కేసీపేట, పెరుమాళ్లపల్లి ఎస్వీ నగర్ వంటి ప్రాంతాల్లో ఉన్న భూసమస్యలను కూడా పరిష్కరిస్తామన్నారు. ప్రజా జీవితంలో వ్యక్తిత్వం, సంస్కారం ఉన్నంత కాలం ప్రజలు ఆదరిస్తారని తన తండ్రి ఎప్పుడూ చెబుతూ ఉంటారని, అందుకు అనుగుణంగా నడుచుకుంటానన్నారు. అనంతరం విభాగాల వారీగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సమీక్షించారు. అల్లరి మూకల ఆట కట్టించాలని తిరుచానూరు, తిరుపతి రూరల్ సీఐలు శివప్రసాద్ రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డిని తుడా చైర్మన్ ఆదేశించారు. అలాగే తిరుచానూరు పరిధిలో హిజ్రాల ఆగడాలు ఎక్కువగా ఉన్నాయని సమావేశంలో చర్చకు వచ్చింది. జెడ్పీటీసీ రత్నమ్మ, వైస్ ఎంపీపీలు వేముల యశోద, విడుదల మాధవ రెడ్డి, ఎంపీడీఓ వెంకటనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

తృణధాన్యాల వంటల పోటీలకు విశేష స్పందన


ప్రథమ స్థానం పొందిన విజేత వరలక్ష్మికి బహుమతి అందజేస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్: ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్, మెప్మా సహకారంతో అఖిల భారత మహిళా వ్యాపారవేత్తల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన తృణధాన్యాల వంటల పోటీలకు విశేష స్పందన లభించింది. రెండు రోజులుగా తృణధాన్యాలతో ఆరోగ్యకరమైన కేకులు, కుకీస్ తయారీపై శిక్షణ ఇచ్చారు. అనంతరం వరదరాజనగర్‌లోని శ్రీబాలాజీ డ్రగ్స్ ట్రేడర్స్ అసోసియేషన్ భవన్‌లో చేపట్టిన వంటల పోటీలకు 60 మంది మహిళలు పాల్గొని తాము తయారు చేసిన వంటకాలు, కేకులను ప్రదర్శించారు. అనంతరం విజేతలకు ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీ.చౌదరి, మెప్మా కో ఆర్డినేటర్ క్రిష్ణవేణి, తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మోహన్‌కుమార్ రాజు, హోల్ సేల్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరత్నం బహుమతులు అందజేశారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వరలక్ష్మి, ధనూజ, కవితకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. అలాగే మంచి రుచికర వంటకాలను చేసిన మరో ఐదుగురు మహిళలకు కన్సొలేషన్ బహుమతులు ఇచ్చారు. పోటీల్లో పాల్గొన్న అందరికీ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ శిక్షణ పొందిన మహిళలు మిల్లెట్స్‌తో రుచికర వంటకాలు తయారు చేస్తే మార్కెటింగ్ సహకారం అందించి వారి స్వయం ఉపాధికి తోడ్పడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి వాసుదేవన్, మదుసూధన్‌రావు, సమాఖ్య అధ్యక్షురాలు రాధిక చౌదరి, అపర్ణ పాల్గొన్నారు.

టాటా మోటార్స్ కొత్త ఐ-సీఎన్‌జీ వెహికల్స్ విడుదల



తిరుపతి కల్చరల్: తిరుచానూరు రోడ్డులోని విజయ భారతి ఆటో మొబైల్స్ షోరూంలో బుధవారం టాటా మోటార్స్ వారి సరికొత్త ఐ-సీఎన్‌జీ వెహికల్స్ విడుదల చేశారు. ఇందులో ముఖ్య అతిథిగా జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ బసిరెడ్డి పాల్గొని ఆల్ట్రోజ్, పంచ్, టియాగో, టిగోర్ కార్లను ఆవిష్కరించారు. విజయభారతి ఆటో మొబైల్స్ షోరూం వినియోగదారులకు సరికొత్త వాహనాలను అందిస్తూ మన్ననలు అందుకోవడం అభినందనీయమన్నారు. షోరూం అధినేత వెంకటరమణన్ మాట్లాడుతూ టాటా సరికొత్త వాహనాల్లో సెగ్మెంట్ ఫస్ట్ ట్విన్ సిలిండర్ టెక్నాలజీ ఉందన్నారు. సీఎన్‌జీతో పాటు 210 లీటర్ల బూస్ట్ స్పేస్‌తో సెగ్మెంట్ అందుబాటులోకి వచ్చిందన్నారు. ఇందులో ఆధునాతన ఐ-సీఎన్‌జీ టెక్నాలజీ ద్వారా డైరెక్ట్‌గా సీఎన్‌జీ మోడల్లోనే కారు స్టార్ట్ చేసుకోవచ్చన్నారు. సురక్షితమైన ఆల్ఫా ప్లాట్ ఫారంతో 5 స్టార్ సేఫ్టీ రేటింగ్ క్రాస్ టెస్ట్‌లో సాధించిందని తెలిపారు. ఐ-సీఎన్‌జీ ట్యాంక్ కెపాసిటీ 60 లీటర్లు, ఒక కేజీ 26 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందన్నారు. ఈ వాహనాలు ఇంజిన్ వారంటీ 3 ఏళ్లు లేదా లక్ష కిలోమీర్లు ఇస్తుందన్నారు. వైర్‌లెస్ మొబైల్ చార్జర్, ఎయిర్ ప్యూరిఫయర్, ఐఆర్‌ఏ, మొబైల్ యాప్, రేర్ ఏసీ వెంట్, 16యు అలైవ్ వీల్స్, ఆటో మెటిక్ హెడ్ ల్యాంప్స్, ఆటో మెటిక వైపర్స్ వంటి సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో టాటా కంపెనీ టీఎస్ఎం సాగర్, సీఎస్ఎం సి.హరివెంకటేష్, సేల్స్ మేనేజర్ భానుప్రకాష్, సి.యశ్వంత్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని అకాడమిక్ కన్సల్టెంట్ల ధర్నా

తిరుపతి సిటీ : ఎస్వీయూలో 110 జీవోను అమలుచేసి న్యాయం చేయాలని అకాడమిక్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. వారు బుధవారం సాయంత్రం వర్సిటీ పరిపాలనా భవనం ఎదుట ధర్నా చేశారు. ఆ సంఘం నాయకులు కే.కిషోర్‌కుమార్‌రెడ్డి, ఐఎస్ కిషోర్ మాట్లాడుతూ విభాగాల విలీన ప్రక్రియలో వివిధ విభాగాల్లోని పోస్టుల సంఖ్యను కుదించడం దారుణమన్నారు. తమకు క్వాలిఫై పరీక్ష లేకుండా నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించి పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అనంతరం వీసీ రాజారెడ్డి, రిజిస్ట్రార్ ఓఎండీ హుస్సేన్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు జగదీశ్వరి, సునీత, దాము యాదవ్, అంజన్ సింగ్, దీన దయాల్, శివశంకర్ రాయల్, బాలు, సుదేష్ణ, వీరారెడ్డి, హరి ప్రసాద్ రెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా


ఓటరు జాబితాపై సమీక్షిస్తున్న డి.హరిత

తిరుపతి తుడా: పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీకి అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని తిరుపతి నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి, నగర పాలక సంస్థ కమిషనర్ హరిత కోరారు. ఆమె బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ బీఎల్‌వోలు ఇంటింటికీ తిరిగి ఓటర్ల జాబితాపై సర్వే చేస్తున్నారని తెలిపారు. వారికి పార్టీలకు చెందిన బూత్ స్థాయి ఏజెంట్లు సహకరించాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణలో సమస్యలు ఉంటే ఏఈఆర్‌ఓల దృష్టికి తీసుకురావాలన్నారు. 18 ఏళ్లు నిండి వారు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, తహసీల్దార్ వెంకటరమణ, ఈడీటీ జీవన్ పాల్గొన్నారు.

సుందరీకరణ పనుల పరిశీలన

తిరుపతి తుడా: తిరుపతి నగరం ఎమ్మార్ పల్లి కూడలిలో ఏర్పాటు చేసిన దండి మార్చ్ విగ్రహాల వద్ద చేపట్టిన సుందరీకరణ పనులను కమిషనర్ హరిత బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. నగరంలోని అన్ని కూడళ్లలో జరుగుతున్న సుందరీకరణ పనులు మరింత వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

రేపు కన్యకా పరమేశ్వరి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం

తిరుపతి కల్చరల్: కొత్త వీధిలోని శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ కార్యదర్శి దిండుకుర్తి నరసింహులు తెలిపారు. ఆయన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. వ్రతానికి సంబంధించిన సామగ్రి మహిళా భక్తులు తీసుకుని రావాల్సి ఉంటుందని తెలిపారు. భక్తుల సంఖ్యను బట్టి వరలక్ష్మీవ్రత పూజలు దశల వారీగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఐలు రాష్ట్ర కార్యదర్శిగా దేవరాజులు



తిరుపతి లీగల్ : ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) రాష్ట్ర కార్యదర్శిగా తిరుపతి న్యాయవాది జె.దేవరాజులును నియమిస్తూ ఐలు రాష్ట్ర కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే రాష్ట్ర కమిటీలో తిరుపతికి చెందిన సీనియర్ న్యాయవాదులు పి.హేమచంద్రారెడ్డి, పి.మురళీని సభ్యులుగా చోటుకల్పించారు. వారిని పలువురు న్యాయవాదులు అభినందించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


ఆర్టీసీ ప్రాంగణంలో మంటలను అదుపు చేస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది

తిరుపతి తుడా: పారిశుద్ధ్య నిబంధనలను అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్ హెచ్చరించారు. ఆయన బుధవారం ఆర్టీసీ ప్రాంగణం, పింక్ టాయిలెట్స్ సమీపంలో చెత్త వేసి నిప్పు పెట్టిన ఘటనపై తనిఖీలు నిర్వహించారు. నీటితో మంటలను అదుపు చేయించారు. వ్యర్థాలను అక్కడి నుంచి తొలగించారు. ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం, దానికి నిప్పు పెట్టడం చట్ట విరుద్ధమన్నారు. నిబంధనలను అతిక్రమించిన ఆర్టీసీ మేనేజర్‌కు నోటీసులు జారీ చేశామని, కమిషనర్ ఆదేశాల మేరకు ఆర్టీసీకి రూ.5,000 జరిమానా విధించామన్నారు. శానిటరీ సూపర్‌వైజర్ సుమతి తదితరులు పాల్గొన్నారు.

రమాదేవిలో అరుదైన శస్త్ర చికిత్స


కోలుకుంటున్న రోగితో వైద్యుల బృందం

తిరుపతి తుడా: తిరుపతిలోని శ్రీ రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఎల్సిపి ప్లేటింగ్ ప్రక్రియ ద్వారా విరిగిన కాలుకు శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శశిధర్ రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా పెద్దమండ్యం మండలం తాటిమాకులపల్లికి చెందిన ఈశ్వరయ్య (43)ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో కాలు పూర్తిగా విరిగిపోయిందని చెప్పారు. కుటుంబ సభ్యులు అతన్ని పలు ఆసుపత్రుల్లో చూపించి చివరికి రమాదేవి ఆసుపత్రికి తీసుకొచ్చారని తెలిపారు. ఆయనకు డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా కింద శస్త్ర చికిత్సను ఉచితంగా చేశామన్నారు. రోగి ప్రస్తుతం కోలుకుంటున్నారని పేర్కొన్నారు. యూరాలజిస్ట్ డాక్టర్ రాజేష్ రెడ్డి, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రవితో కూడిన వైద్యుల బృందం చికిత్సలో పాల్గొన్నట్టు తెలిపారు.

ఆదర్శనీయుడు టంగుటూరి


ప్రకాశం పంతులుకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి


టంగుటూరి ప్రకాశం పంతులుకు నివాళులర్పిస్తున్న వీసీ రాజారెడ్డి, అధ్యాపకులు, ఉద్యోగులు

తిరుపతి అర్బన్ : ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అందరికి ఆదర్శనీయులని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ఆయన జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో బుధవారం టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికార అధికారి భాస్కర్‌రెడ్డి, ఉప కార్మిక కమిషనర్ బాలునాయక్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి బాలకొండయ్య పాల్గొన్నారు.

తిరుపతి సిటీ : ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆదర్శనీయులని ఎస్వీయూ వీసీ రాజారెడ్డి కొనియాడారు. ఎస్వీయూ పరిపాలనా భవనం వద్ద బుధవారం ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఎస్వీయూ స్థాపనకు ఆయన కృషి ఎనలేనిదన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో సైమన్ కమిషన్‌కి వ్యతిరేకంగా పోరాడి గుండె చూపించిన ధీరోదత్తుడు టంగుటూరి అని కొనియాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్, వర్సిటీ బోధన, భోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ బాధితులతో జేసీ సమావేశం


రైతులతో మాట్లాడుతున్న జేసీ డీకే బాలాజీ

చంద్రగిరి: జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులతో జేసీ డీకే బాలాజీ బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎన్‌హెచ్-71 కాలూరు-పీలేరు నాలుగు లైన్ల జాతీయ రహదారి ఏర్పాటుకు ఇప్పటికే అధికారులు భూములను స్వాధీనం చేసుకున్నారు. ఇంకా భూమి అవసరం కావడంతో జేసీ బాలాజీ రైతులతో సమావేశమై 3జీ విచారణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి తీసుకుంటున్న భూమికి, నోటిఫికేషన్ జారీ చేసిన నాడు ఉన్న ధర కన్నా రెండున్నరెట్లు అధికంగా అందజేస్తామన్నారు. ఇందులో ఆలస్యమైతే 12 శాతం అదనంగా చెల్లిస్తామని చెప్పారు. త్వరలో భూసేకరణ పూర్తి చేసి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. రహదారి విస్తరణలో భాగంగా భూమిలో ఉండే నిర్మాణాలు, అప్రూవల్, నాన్ అప్రూవల్, బావులు వంటి వాటికి ప్రభుత్వ ధరల ప్రకారం పరిహారం చెల్లిస్తామని పేర్కొన్నారు. తహసీల్దార్ శిరీష, జాతీయ రహదారి అధికారులు పాల్గొన్నారు.

వికలాంగులకు ఎమ్మెల్సీ సిపాయి ఆర్థిక సాయం


విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్: అంగవైకల్యం కల విద్యార్థుల చదువు కోసం రష్ ఆసుపత్రి అధినేత, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. మదనపల్లికి చెందిన చలపతి పిల్లలు వెంకటేష్, అనూష, ప్రత్యూష అంగవైకల్యంతో బాధపడుతున్నారు. వీరికి ఆయన రూ.5 వేలు అందజేశారు. పిల్లల తండ్రి చలపతి మాట్లాడుతూ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తమ పిల్లల విద్య కోసం ఏడేళ్లుగా సాయం అందించడం మరువ లేదని కొనియాడారు.

వేదాంతపురం అభివృద్ధే ధ్యేయం


జనార్దన్‌యాదవ్‌ను అభినందిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహకారం, తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదాంతపురం పంచాయతీ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని సర్పంచ్ చెరుకుల జనార్దన్‌యాదవ్ పేర్కొన్నారు. ఆయన బుధవారం పంచాయతీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డితో కలిసి గ్రామంలోని వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన జనార్దన్‌యాదవ్‌కు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు వేముల యశోద, విడుదల మాధవరెడ్డి, తిరుచానూరు మార్కెట్ యార్డు చైర్మన్ వీరపల్లి శ్రీవిద్య, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అభినందనలు తెలిపారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి


ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ లోకనాథం, నంగా పద్మజారెడ్డి

పాకాల : మండలంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలంలో చేపట్టిన పనులను అధికారులు నిత్యం పర్యవేక్షించి త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. ఏఓ పుష్పావతి మాట్లాడుతూ రైతులు ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. ఎంఈఓ బాబ్జీ మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో రూ.7 కోట్లతో నాడు-నేడు పనులు జరుగుతున్నాయని, జిల్లాలో ఎక్కడా లేని విధంగా ఎన్‌పీఎన్ ప్రాథమిక పాఠశాలలో 370 మంది విద్యార్థులు ఉన్నారని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం పలు పంచాయతీలకు వచ్చిన ప్రశంసా పత్రాలను ఎంపీపీ, జెడ్పీటీసీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ మునీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఎంపీడీవో ప్రభాకర్, బీసీ స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి

రామచంద్రాపురం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల అధికారులు పంచాయతీల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. జెడ్పీటీసీ ఢిల్లీరాణి మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవగాహన కల్పించాలని సూచించారు. రేషన్ కార్డుల మంజూరుపై సచివాలయ సిబ్బంది ప్రత్యేక చొరవ చూపాలన్నారు. సెరికల్చర్ ఏఈ సునీల్ మాట్లాడుతూ పామోలిన్‌సాగుకు మండలం ఎంపికైందని, ప్రభుత్వం సబ్సిడీతో పామోలిన్ మొక్కలను అందజేస్తుందని పేర్కొన్నారు. ఏపీఓ హంసవేణి మాట్లాడుతూ మునగ, డ్రాగన్ ఫ్రూట్ సాగుకు ఉపాధి హామీ కింద మూడేళ్లపాటు ప్రభుత్వం నిధులు అందజేస్తుందన్నారు. ఎంపీడీవో మహ్మద్ రఫీ, తహసీల్దార్ చిన్న వెంకటేశ్వర్లు, సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అలిపిరి నడకదారిలోని దుకాణాల తనిఖీ

తిరుమల : అలిపిరి-తిరుమల నడకదారిలోని దుకాణాల్లో పండ్లు, కూరగాయల విక్రయాలను రద్దు చేసిన నేపథ్యంలో టీటీడీ రెవెన్యూ, విజిలెన్స్, ఆరోగ్య, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు బుధవారం తనిఖీలు చేశారు. అలిపిరి నుంచి మోకాలు మెట్టు వరకు దుకాణాల్లో కూరగాయలు, పండ్లు విక్రయాలు చేయరాదని సూచించారు. రెవెన్యూ అధికారి నారాయణచౌదరి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని బుధవారం తెలంగాణ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, మ్యూజిక్ డైరెక్టర్ శివమణి, చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాస్ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డు, ప్రసాదాలతో సత్కరించారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ


పెళ్లి కానుక అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పాకాల : దామలచెరువు మౌలాలిపేటకు చెందిన నూతన వధూవరులు ఎస్.అష్రఫ్, ఎస్.హసీనాకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పెళ్లి కానుక పంపించారు. వాటిని బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో దామలచెరువు ఉపసర్పంచ్ ఇమ్రాన్, కో-ఆప్షన్ మెంబర్ ఖాజామస్తాన్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ


ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టిన దొంగలు

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం జంగావాండ్లపల్లె పంచాయతీ మారసానివారిపల్లె వద్ద మంగళవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. దుండగులు వ్యవసాయ బావి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను పగలుగొట్టి కాపర్ వైర్లు, రాగి కోర్ చోరీ చేశారు. అలాగే మారసానివారిపల్లె కురవపల్లె సింగల్‌ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలుగొట్టి అందులోని రాగి వైరును అపహరించారు. వీటిపై రైతులు, గ్రామస్తులు ట్రాన్స్‌కో ఏఈ రెడ్డిప్రదీప్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన భాకరాపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కలెక్టర్‌ను కలిసిన రవాణాశాఖ సభ్యుడు



తిరుపతి అర్బన్: రాష్ట్ర రవాణాశాఖ సభ్యుడు ఎం.సునీల్ చక్రవర్తి బుధవారం కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనను కలెక్టర్ అభినందించారు.

వీల్ చైర్స్ వితరణ


వీల్ చైర్స్ అందజేస్తున్న చిల్లీస్ అధినేత అంజి

తిరుపతి కల్చరల్: ఏపీ హోటల్స్ అసోసియేషన్ సభ్యుడు, చిల్లీస్ హోటల్స్ అండ్ రెస్టారెంట్ అధినేత చిల్లీస్ అంజి జన్మదినం సందర్భంగా బుధవారం అభయక్షేత్రం, అక్షయక్షేత్రం, మాతృశ్య వృద్ధాశ్రమం, తెలుగుతల్లి ఆశ్రమం, పాస్ మనోవికాస్ తదితర ఆశ్రమాలకు వీల్ చైర్స్ వితరణ చేశారు. చిల్లీస్ వద్ద వెయ్యి మందికి మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి వద్ద ఫ్రీడం ఫ్రమ్ హంగర్స్ సంస్థ సభ్యులు పేదలకు అన్నదానం చేశారు. బ్లడ్ క్యాంప్ ద్వారా 40 మంది రక్తదానం చేశారు. 200 మంది ఆటో డ్రైవర్లు ర్యాలీగా చిల్లీస్ వద్దకు చేరుకుని అంజిని ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే.బాబు, కార్పొరేటర్ కోటూరు ఆంజనేయులు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

వీహెచ్‌పీ తిరుపతి నగర అధ్యక్షుడిగా నరసింహులు



తిరుపతి కల్చరల్: విశ్వ హిందూ పరిషత్ తిరుపతి నగర అధ్యక్షుడిగా దిండుకుర్తి నరసింహులును నియమించినట్లు వీహెచ్‌పీ ప్రాంత కార్యదర్శి కాకర్ల రాముడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నరసింహులు రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

జీపు, కారు డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

తిరుమల : ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుమలలో జీపులు, కార్ల డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని తిరుమల అదనపు ఎస్పీ మునిరామయ్య తెలిపారు. ఆయన బుధవారం తిరుమల ట్రాఫిక్ డీఎస్పీ కొండయ్యతో కలిసి స్థానిక శ్రీవారి సేవాసదన్‌లో వచ్చే నెలలో జరిగే శ్రీవారి వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా జీపు, ట్యాక్సీలు, కార్ల డ్రైవర్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ట్యాక్సీల డ్రైవర్లు ఆర్టీఏ అధికారులు నిర్ణయించిన ధరలను మాత్రమే ప్రయాణికుల నుంచి వసూలు చేయాలని ఆదేశించారు. తిరుమలలో కారు పార్కింగ్‌లో మాత్రమే వాహనాలను నిలుపుకోవాలన్నారు. తిరుమలలో త్వరలో ప్రీపెయిడ్ ట్యాక్సీ కౌంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ట్రాఫిక్ డీఎస్పీ మాట్లాడుతూ ఘాట్ రోడ్లలో ప్రమాదాల నివారణకు డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. టీటీడీ ఏవీఎస్వో గిరిధర్ పాల్గొన్నారు.